క్లుప్తంగా

ముమ్మరంగా పూడికతీత పనులు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న పక్కా డ్రెయిన్లలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ముంపు సమస్యను అధిగమించడానికి మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టారు. 45వ డివిజన్ బస్టాండ్ సెంటర్ ప్రాంతంలో ప్రస్తుతం పూడికతీత పనులు జరుగుతున్నాయి. బస్టాండ్ వైపు ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన సిల్టును తొలగిస్తున్నారు. ఈ పనులను టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ పీవీ ఫణికుమార్, పారిశుద్ధ్య విభాగ అధికారులు పర్యవేక్షించారు.

సర్వజన ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి



మచిలీపట్నంటౌన్: స్థానిక సర్వజన ఆస్పత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం హాస్పటల్ సూపరింటెండెంట్ రమేష్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో ఎండోస్కోపీ పరికరం ఉన్నా వినియోగించడం లేదని దీన్ని అందుబాటులోకి తెచ్చి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. డెలివరీ వార్డులో ఏసీలు, ఫ్యాన్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 108లో పేషెంట్‌ను తీసుకురాగానే రోగిని ఆస్పత్రిలో తీసుకెళ్లేందుకు ఎంఎన్‌వోను ఏర్పాటు చేయాలన్నారు. సూపరింటెండెంట్‌తో పాటు ఆర్‌ఎంవో నిరంజన్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావులకు వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, జోగి శివ, బెల్లంకొండ రవి, ధనికొండ చిన్ని, ఎం గోపీప్రసాద్, ఎం పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు



కృత్తివెన్ను: మూడు రోజులుగా కృత్తివెన్ను పంచాయతీ సీతనపల్లి స్లోపు సమీపంలోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద జరుగుతున్న స్వామివారి 26వ వార్షిక మహోత్సవాలు ముగిశాయి. ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరుగుతుందని చైర్మన్ కె. నాగబాబు తెలిపారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అభినందన



అవనిగడ్డ: ఎమ్మెల్యేగా ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్‌ను పలువురు అధికారులు మంగళవారం కలుసుకున్నారు. బుద్ధప్రసాద్ స్వగృహంలో ఘంటసాల తహసీల్దార్ విజయలక్ష్మి, చల్లపల్లి తహసీల్దార్ బి.సుమతి, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ ఆయనను కలసి పూలమాల వేసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తవత్సలా గోవిందా..

- వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- కనులపండువగా వెంకన్నకు శతకలశ క్షీరాభిషేకం
- నేడు స్వామివార్ల కల్యాణం



ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేస్తున్న పండితులు

కోడూరు: భక్తవత్సలా గోవిందా.. అంటూ భక్తజనం వేంకటేశ్వరుడిని కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాలను ప్రారంభించి, తిరువారాధన, హోమాలను నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన సమ్మిట వెంకటకృష్ణామాచార్యులు – వెంకటరాధాదేవి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకాన్ని వైభవోపేతంగా జరిపారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను కోడూరులోని యిమ్మడి రాంబాబు ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. కోడూరు, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానార్చకులు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్యాణానికి ఏర్పాట్లు

బుధవారం ఉదయం కౌతుకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. రాత్రి స్వామివార్ల కల్యాణం జరుగుతుందని చెప్పారు. కల్యాణాన్ని తిలకించడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కల్యాణ వేదికను ముస్తాబు చేయడంతో పాటు ఆలయమంతా పూలతోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన రహదారి వద్ద నుంచి ఆలయం వరకు ఏర్పాట్లు చేసిన సప్తద్వారాల సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణతో పాటు స్వామివారి భారీ విద్యుత్ చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కలశాలను ఆలయం చుట్టూ ఊరేగిస్తున్న భక్తులు



108 కలశాలకు పూజలు

దివిసీమలో ఈదురు గాలులు, వర్షం

- పలుచోట్ల నేలకొరిగిన భారీ వృక్షాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



ఘంటసాల మండలం తెలుగురావుపాలెం వద్ద ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం



కోడూరులో కురుస్తున్న భారీ వర్షం

అవనిగడ్డ/ఘంటసాల: దివిసీమలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో తీగలు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోడూరు మండలం పిట్టల్లంక, సాలెంపాలెం, మోపిదేవి మండలం కోసూరువారిపాలెం, పెదకళ్లేపల్లి, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. భారీ మెరుపులు, ఉరుములు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పంచాయతీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలు చల్లుకుని ఎదురు చూస్తున్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది. మెట్ట ప్రాంత పంటలకు ఈ వర్షం ప్రయోజనం చేకూరుస్తుందని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

కోడూరు: కోడూరు చుట్టు పక్కల గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆకాశం కారుమబ్బులు కమ్ముకొని భారీగా ఈదురుగాలులు వీచాయి. అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు గాలులు తీవ్రత కూడా అధికంగా ఉండటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మట్టి అక్రమ రవాణా కారణంగా ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గోవధ చట్టం ఉల్లంఘనపై ఫిర్యాదు



కృత్తివెన్ను తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హిందూ ధార్మికసంఘాల ప్రతినిధులు

కృత్తివెన్ను: గోవధ చట్టాన్ని అతిక్రమించి బక్రీదు సందర్భంగా పెడన పట్టణంలో ఒక ఆవు గొంతు కోయడమే కాకుండా మరికొన్ని ఆవులను వధించడానికి పూనుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, శివశక్తి సంఘాల ప్రతినిధులు మంగళవారం కృత్తివెన్ను తహసీల్దార్ సుందర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. బక్రీదు సందర్భంగా ఈ నెల 17వ తేదీ పెడన పట్టణం ఆరో వార్డుకు చెందిన కొందరు ముస్లిం మత పెద్దలు గోవులను వధించడానికి సిద్ధపడ్డారన్నారు. విషయం తెలుసుకున్న పలు హిందూ సంఘాల పెద్దలు అక్కడి చేరుకునే సమయానికి ఒక ఆవును వధించి మరికొన్ని గోవులను కట్టేసి ఉంచినట్లు పేర్కొన్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి గోవులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారన్నారు. గోవధ చట్టం అమలులో ఉన్నా యథేచ్ఛగా గోవధ చేయడానికి పూనుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాని వారు వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నియోజవకర్గ కో కన్వీనర్ మాగంటి గంగరాజు, వీహెచ్‌పీ ప్రఖండ ఇన్‌చార్జ్ ఇల్లూరి నాగబాబు, బీజేపీ కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల అధ్యక్షులు కొక్కిలిగడ్డ ఏసురాజు, బండ్రెడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: పెడన పట్టణంలో ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా గోహత్యకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వీహెచ్‌పీ, భజరంగదళ్, శివశక్తి సభ్యులు మంగళవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కన్వీనర్ ఇ.నాగబాబు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బి. ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఎం.గంగరాజు, ఎం.వెంకటేశ్వరరావు, కార్యకర్తలు వి.కరుణకుమార్, పి. శ్రీనివాసరావు, వి.రంగయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లంకభూములకు పట్టాలివ్వండి

ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా దుర్గారావు



వినతిపత్రం ఇస్తున్న రైతు కూలీ సంఘం నేత దుర్గారావు, కూలీలు

ఘంటసాల: లంక భూములను సాగుచేసుకుంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా దుర్గారావు డిమాండ్ చేశారు. పాపవినాశనం గ్రామానికి చెందిన నిరుపేదలైన 50 కుటుంబాల వారికి లంక భూములకు పట్టాలు ఇప్పించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలియజేసి తహసీల్దార్ ఎన్.బి.విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. అనంతరం దుర్గారావు మాట్లాడుతూ ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన నిరుపేదలైన 50 కుటుంబాల వారు 2017లో వరద ముంపునకు గురయ్యే సుమారు 30 ఎకరాల లంక భూముల్లో అహోరాత్రులు శ్రమించి ముళ్ల తుప్పలు తొలగించి, ఎత్తుపల్లాలు సరి చేసుకుని జీవనోపాధికి కూరగాయలు, ఇతర ఆహార ఉత్పత్తులు పండించుకుంటున్నారు. వర్షాభావంతో పంటలు పండించుకోవడానికి సాగునీరు లేక పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాల వారికి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లంకభూమిని సర్వే చేయించి ఆయా భూముల ఆధారంగా జీవనోపాధి పొందుతున్న 50 కుటుంబాల వారికి పట్టాలు మంజూరు చేసి, విద్యుత్ సౌకర్యం కల్పించి, భూమిలేని వ్యవసాయ కూలీల ఉపాధికి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా నేత జె.నెలబాలుడు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నేత సీహెచ్ సుధీర్, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'కాగిత'కు సత్కారం



పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న చేనేత కలంకారీ పరిశ్రమ ప్రతినిధులు

పెడన: పట్టణ పరిధిలోని చేనేత కలంకారీ పరిశ్రమ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్(కేపీ)ను కలసి తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలంకారి పరిశ్రమను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నుంచి క్లాత్, వాషింగ్, డై తదితర మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కలంకారీ పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించడానికి కృషి చేస్తానన్నారు. సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ వైస్ ప్రెసిడెంట్ మెట్ల దుర్గానాగేశ్వరరావు, సెక్రటరీ సజ్జా నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కె. నిర్మల్‌కుమార్, సభ్యులు బి. భానుప్రకాష్, పి. కోటేశ్వరరావు, ఎస్. మహేష్, ఎ. రామాంజనేయులు, వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

పీఎం కిసాన్ సమ్మాన్‌ను సద్వినియోగం చేసుకోండి



ఘంటసాల కేవీకేలో రైతులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలత

ఘంటసాల: వ్యవసాయ పనుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం విడుదల చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత కార్యక్రమాన్ని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో లైవ్ ద్వారా రైతులు, శాస్త్రవేత్తలు వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.శ్రీలత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రూ.2 వేలను దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్లు ప్రధానమంత్రి విడుదల చేయగా, కృష్ణా జిల్లాలో 1,11,604 మంది రైతులకు రూ.22,32,08,000 వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఖరీఫ్ వ్యవసాయ పనులకు సంబంధించి పలు సూచనలు, సలహాలు, విత్తన శుద్ధి గురించి రైతులకు తెలియజేశారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని కేవీకే శాస్త్రవేత్త వి.మంజువాణి తెలుగులో రైతులకు అనువాదం చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు జి.కృష్ణవేణి, వి.నవీన్, కె.రేవతి, ఘంటసాల, బోడగుంట, మోపిదేవి, కాజ తదితర గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయకస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో ఉదయం నిత్యబలిహరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి వధూవరాన్వేషణం(ఎదుర్కోలు) ఉత్సవాన్ని నాయుడు వేంకటరమణ మూర్తి దంపతులతో వారి గృహం వద్ద నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో యాజ్ఞికస్వామి కాశీనాధుని పూర్ణరవీంద్ర బాపేశ్వరశర్మ బ్రహ్మత్వంలో పలు యజ్ఞాలు నిర్వహించి పూజలు చేశారు. సుహాసినిలు శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. రాత్రికి చింతామణి నాటకం నుంచి ప్రణయఘట్టం సీను భక్తులను ఆకట్టుకుంది. ఆర్గనైజర్ బి.నాగరాజు ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

విద్యార్థినిలకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు మంగళవారం శ్రీషిర్డీనాగసాయివిజయదుర్గ హరిహర బాలాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ చేశారు. అర్చకులు ఇటికాల నాగపవన్‌కుమార్ సౌజన్యంతో నాగప్రసాద్ బుస్సే చేతుల మీదుగా 300 నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని దాతలు కోరారు. కళాశాల అధ్యాపకులు మోహిని కృష్ణకుమారి, పద్మజ, ఉమాదేవి, సుబ్రహ్మణ్యం, రాము, సుధాకర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరాన మేఘాల పరదాలు



నాగాయలంక కృష్ణానదీ తీరంలో శ్రీరామ పాద క్షేత్రం ప్రాంతంలో ఆకాశాన్ని జలతారు పరదాలు కప్పినట్టున్న సుందర దృశ్యం వీక్షకులను కనువిందు చేసింది. మంగళవారం పగలంతా ఎండవేడిమితో ఉక్కపోత పోయగా, సాయంత్రం ఇలా మేఘాలు పరదాల్లా కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడింది. నీలిరంగు గగన తలంలో వెండి జలతారు అల్లిన చందంగా ఉన్న ఈ మనోహర దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. -నాగాయలంక

రాయితీపై విత్తనాల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో రాయితీపై వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ మాట్లాడుతూ విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించుకోవడంతో పాటు విత్తన శుద్ధి విధిగా చేసుకోవాలని రైతులకు సూచించారు. విత్తన శుద్ధి వల్ల పైరు ప్రారంభ దశలో తెగుళ్ల పురుగుల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. రాయితీపై ఎంటీయూ 1061 –1018 రకం వరి విత్తనాలు 30 కిలోల బస్తా రూ.1044కే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా రాకేష్ కుమార్, స్థానిక ప్రముఖులు జగన్మోహన్‌రావు, వెంకటరమణ, ప్రసన్నకుమార్, ప్రసాద్, వరలక్ష్మి, పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు నిర్వహించారు. పలువురు దంపతులు తమ పిల్లలకు అన్నప్రాసనలు చేయించారు. తులాభారం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

వీరాంజనేయుడికి విశేష పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జేష్ఠ మాసం మంగళవారం పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి విశేషంగా ఆవుపాలతో, పంచామృతాలతో, నవ రసాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలను, నాగవల్లీలతో, వడ మాలతో, పుష్పమాలలతో స్వామిని అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు వండి స్వామికి నివేదనలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. నూతన వాహనదారులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుకల్యాణ మహోత్సవం

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానం 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో శ్రీవెంకటేశ్వర స్వామివారి తిరుకల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి సువర్ణ పుష్పార్చన, సామూహిక విష్ణు సహస్ర నామార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు గరుడోత్సవం చేశారు. కాగా త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవం తిలకించారు. బుధవారం శ్రీవారికి లక్ష మల్లెల అర్చన, 11 గంటలకు భక్తులకు అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

ఘనంగా కుంభారాధన

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామికి కుంభారాధన చేశారు. వార్షికోత్సవంలో భాగంగా లక్ష్మీనారాయణ యాగం చేసి 108 కళశాలతో స్వామికి పంచామృతాభిషేకం చేసినట్లు ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి దివ్య తిరుక్కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

హనుమాన్‌జంక్షన్: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం అమలుపై మంగళవారం ఆమె ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడి బయటి పిల్లలను గుర్తించి, విధిగా వారిని పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్ మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహించాలని కోరారు. ఇప్పటికే మండలంలోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశామని, వీటిని విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.